క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సరస్వతీగూడకు చెందిన రాములుకు రూ.35వేలు, శంకర్‌కు రూ.30వేల చొప్పున మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మండల కేంద్రంలో వారు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాము, ఎంపీటీసీ సభ్యుడు మంచాల యాదయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జి.విజేందర్ రెడ్డి, నాయకులు దేశం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తాం

జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపిన బీజేపీ నేత అందెల



మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. జేపీఎస్‌లతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కోకన్వీనర్ అనంతయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు జంగయ్యయాదవ్, సర్పంచ్‌లు చంద్రయ్యగౌడ్, శ్రీశైలంగౌడ్, రఘుపతిగౌడ్, మనోహర్, శంకర్, సురేష్, సాధ మల్లారెడ్డి, శైలజ, నాయకులు కృష్ణ, శ్రీరాములు, వెంకటరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'పది'లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ



సింధుజ (9.8 జీపీఏ) కీర్తన (9.8 జీపీఏ) ఇ.వంశీ (9.8 జీపీఏ) సాత్విక్ (9.7 జీపీఏ) శ్రీజ (9.7 జీపీఏ) కె.వర్ష (9.7 జీపీఏ) పూజ్యశ్రీ (9.7 జీపీఏ) నిఖిత (9.7 జీపీఏ)



సాత్వి (9.5 జీపీఏ) శ్రీవర్ష (9.5 జీపీఏ) కె.హాసిని (9.5 జీపీఏ) హరిత (9.5 జీపీఏ) అలోక్ కుమార్ (9.5) రిషిత (9.5 జీపీఏ) రంగా (9.3 జీపీఏ) తరణం (9.3 జీపీఏ)



సరిత (9.3 జీపీఏ) హారిక (9.3 జీపీఏ) సింధు (9.3 జీపీఏ) ప్రియా (9.2 జీపీఏ) శివకుమార్ (9.2 జీపీఏ) నవ్య (9.0 జీపీఏ) గంగారాం (9.0 జీపీఏ) నాగలక్ష్మీ (9.0 జీపీఏ)

మీర్‌పేట: బుధవారం ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో మీర్‌పేట జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 70.32 శాతం ఉత్తీర్ణత సాధించిందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరళ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 219 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 154 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో జి.సాత్వి 9.5 జీపీఏ సాధించగా, ఎస్.రంగా, తరణంబేగం, కే.సరతి, బి.హారిక, మాధురి, ఏ.సింధు 9.3 జీపీఏ, ఎం.ప్రియ, కె.శివకుమార్, జి.ఉదయ్‌కుమార్ 9.2 జీపీఏ, నాగలక్ష్మి, ప్రవీణ్ 9.0 జీపీఏ పాయింట్లు సాధించినట్లు పేర్కొన్నారు.

వీఎం హోమ్‌లో 88 శాతం ఉత్తీర్ణత..

హుడాకాంప్లెక్స్: పదవ తరగతి ఫలితాల్లో విక్టోరియా మెమోరియల్ స్కూల్ విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. 64 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 56 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏడుగురు సైన్స్‌లో ఫెయిల్ అయినట్లు సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి తెలిపారు. పి.శ్రీవర్ష 9.5, ఆర్.నవ్య, యూ.గంగారాం 9.0 జీపీఏ సాధించాడు. గంగారాంను ఉపాధ్యాయులు అభినందించారు.

తుక్కుగూడ మున్సిపాలిటీలో..

తుక్కుగూడ: బుధవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో తుక్కుగూడ మున్సిపాలిటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. రావిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సొకుంట్ల సింధుజ 9.8 జీపీఏ, గోసుల కీర్తన 9.8 జీపీఏ, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి మురారీ 10 జీపీఏ సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండల పరిధిలో నేదునూరు మోడల్ స్కూల్ విద్యార్థిని కె.వర్ష, కందుకూరు బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.పూజ్యశ్రీ, నేదునూరు సేయింట్ జోసెఫ్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ముస్కాన్ 9.7 జీపీఏతో ప్రథమ స్థానంలో నిలిచారు. 9.5 జీపీఏతో మోడల్ స్కూల్ విద్యార్థిని హాసిని, నోబుల్ హైస్కూల్ విద్యార్థులు పి.హరిత, అలోక్‌కుమార్ దూబే, ఎస్.రిషిత, సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థిని వి.నిఖిత ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. కాగా హయత్‌నగర్ మండలం అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో కొనసాగుతున్న కందుకూరుకు చెందిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సొసైటీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి వంశీ 9.8 జీపీఏ మార్కులు సాధించాడు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 68 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది.

మహేశ్వరం మండలంలో..

మహేశ్వరం: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ గ్రేడులు సాధించి సత్తా చాటారు. బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మహేశ్వరం మండలంలోని 785 మంది విద్యార్థులకు గాను 613 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో ఉన్న 16 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 78 శాతం ఉత్తీర్ణత వచ్చిందని మండల విద్యాధికారి కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్(95 శాతం), అమీర్‌పేట్ బాలికలు 90 శాతం, రావిర్యాల, తుమ్మలూరు, మహేశ్వరం బాలికల పాఠశాలలు 83 శాతం ఉత్తీర్ణత సాధించాయి. పది ఫలితాల్లో 45 శాతం ఫలితాలతో మంఖాల్ ఉన్నత పాఠశాల చివరి స్థానంలో నిలిచింది. మండలంలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన రావిర్యాల సింధుజ(9.8 జీపీఏ), కీర్తన (9.8 జీపీఏ), మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌కి చెందిన శ్రీజ (9.7 జీపీఏ), నాగారం పాఠశాలకు చెందిన సానీయా(9.7 జీపీఏ), అదీబా(9.7 జీపీఏ), తుమ్మలూరు పాఠశాలకు చెందిన బొల్ల మౌనిక (9.5 జీపీఏ), మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన కేతావత్ రామ్‌దాస్(9.5 జీపీఏ), బానావత్ తరుణ్(9.5 జీపీఏ) సాధించారు.

కొనసాగుతున్న వీఓఏలు సమ్మె

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో మేకకు వినతిపత్రం అందించి తమ నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు మాట్లాడుతూ.. వీఓఏలకు రూ.26వేల వేతనంతో పాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు రాధ, శారద, బాలమణి, కవిత, సంగీత, మంజుల, జ్యోతి, విజయ, దేవి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎంపీఓగా కల్యాణి



కందుకూరు: కందుకూరు నూతన ఎంపీఓగా పి.కల్యాణి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ నాలుగున్నర ఏళ్లుగా ఎంపీఓగా కొనసాగిన విజయలక్ష్మి కొత్తూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఫరూఖ్‌నగర్ మండలం నుంచి కల్యాణి ఇక్కడికి వచ్చారు. సోమవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

శ్రీవారి హుండీ లెక్కింపు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపును బుధవారం ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒక నెల 9రోజులకు గాను హుండీ ఆదాయం రూ.68,360 రావడం జరిగిందని ఆయన తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సంజయ్‌గోపాల్, కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త జంగారెడ్డి పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్‌లో మన నాయకులు



భట్టి పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

కందుకూరు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అఫ్జల్‌బేగ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డితో పాటు నాయకులు ఢిల్లీ శ్రీధర్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేష్, జగన్, పాండు రంగారెడ్డి, ఫకీర్ కృష్ణ, వత్తుల నారాయణ, ఆలేటి ప్రభు, నయీమ్, సర్గారి మాధవ్‌రెడ్డి, యాలాల రాంరెడ్డి, జగన్, నర్సింహ, యాదయ్య, చంటి తదితరులు సుల్తాన్‌పూర్ నుంచి మామిడిపల్లి వరకు చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అబ్దుల్లా

పహాడీషరీఫ్: సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు అబ్దుల్లా బిన్ అవద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పహాడీషరీఫ్‌లో కొనసాగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా బుధవారం మామిడిపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో అబ్దుల్లాకు.. భట్టి విక్రమార్క కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిగురింత నర్సింహారెడ్డి నేతృత్వంలో పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని అబ్దుల్లా పేర్కొన్నారు.